సాక్షి అన్నమయ్య జిల్లా

ఆదివారం । 9 । ఏప్రిల్ । 2023



రాజ్యాంగంతోనే ప్రజా స్వామ్య పరిరక్షణ

రాజ్యాంగంతో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షణకు కృషి చేయాలని వీసీకే పార్టీ జాతీయ అధ్యక్షుడు తిరుమావళవన్ అన్నారు. -8లో..



అంతర్‌రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

ఓ వైపు సెల్‌ఫోన్ల చోరీ, మరోవైపు పిక్ పాకెటింగ్‌కు పాల్పడుతున్న అంతర్ రాష్ట్ర ముఠా సభ్యులను పోలీసులు అరెస్ట్ చేశారు. -8లో..

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.74	రూ.92
రెండోరకం	రూ.50	రూ.72



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 187 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)



రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	540	540
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 86 కిలోలు

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ ఆది (సా॥)	సహర్ సోమ (ఉ॥)
రాజంపేట	6.32	4.46
రాయచోటి	6.32	4.45
మదనపల్లి	6.34	4.45
పీలేరు	6.30	4.40

కరువుసీమలో విద్యాసౌరభం

- అందుబాటులో శాస్త్ర, సాంకేతిక, వైద్య, పరిశోధన విద్యా సంస్థలు
- కేజీ నుంచి పీజీ వరకు వైఎస్సార్ జిల్లాలో ఉన్నత విద్య



యోగివేమన విశ్వవిద్యాలయ ముఖద్వారం

సాక్షి ప్రతినిధి, కడప: విద్యా రంగంలో వైఎస్సార్ జిల్లా కీర్తి పతాక స్థాయికి చేరింది. ఎల్‌కేజీ నుంచి పీజీ వరకూ ప్రభుత్వ విద్య అందుబాటులో ఉంది. శాస్త్ర, సాంకేతిక, వైద్య, పరిశోధన రంగాల్లో నిష్ణాతులు తెరపైకి వస్తున్నారు. ఒకప్పుడు ఫ్యాక్షన్‌కు మారుపేరుగా నిలుస్తున్న కడప ఎడ్యుకేషనల్ హబ్‌గా మారింది. ప్రతిష్టాత్మక సెంట్రల్ వర్సిటీకి సవాల్‌గా యోగివేమన యూనివర్సిటీ నిలుస్తోంటే, వైద్య రంగంలో తాము సైతం దీటైన వారమంటూ రిమ్స్ శైలి ఆచరణలో కన్పిస్తోంది. కడప గడపలో ఫార్మసీ, దంత వైద్యం, పశువైద్యం, ట్రిపుల్ ఐటీ, జేఎన్‌టీయూ ఇంజనీరింగ్, ఆర్కిటెక్చర్ రంగాల్లోని సంస్థలు కొలువై ఉన్నాయి. చదువులకు కేరాఫ్‌గా నిలుస్తోంది. వివిధ రాష్ట్రాలకు చెందిన యువకులు ఉచిత విద్యను అందిస్తోంది. కొత్త కొత్త విద్యా సంస్థలతో నాడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పునాది వేయగా, నాడు–నేడు, విద్యా దీవెన, వసతి దీవెన వంటి పథకాలతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చదువులకు సాయం చేస్తున్నారు.

సత్తా చాటుతున్న రిమ్స్...

2005లో నెలకొల్పిన రాజీవ్‌గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సు (రిమ్స్) కళాశాల సత్తాచాటుతోంది. 2006–07లో 150 ఎంబీబీఎస్ సీట్లతో విద్యా సంవత్సరం ప్రారంభమైంది. కడప శివార్లలోని పాలకొండలకు సమీపంలో దాదాపు 230 ఎకరాల విస్తీర్ణంలో 150 కోట్లతో చేపట్టారు. రిమ్స్‌లో 2013 నుంచే పీజీ సీట్లు మంజూరయ్యాయి. తాజాగా 14 విభాగాలకు గాను 72 పీజీ సీట్లు రిమ్స్ పరిధిలో ఉన్నాయి. 7 విభాగాల్లో పీజీ సీట్ల మంజూరు వివరాలకు సంబంధించిన ఉత్తర్వులు ఈనెల 10, 11 తేదీల్లో రానున్నాయి.

దంత వైద్యంలో మేటి

కడప రిమ్స్ ఆవరణలోనే డాక్టర్ వైఎస్ఆర్ ప్రభుత్వ దంతవైద్య కళాశాల 2008 మే 9న ప్రారంభమైంది. అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 2009 జనవరి 24న తన చేతుల మీదుగా కడప ప్రభుత్వ దంతవైద్య కళాశాలను ప్రారంభించారు.

రిమ్స్ నెలకొల్పింది:	2005
యూజీ సీట్లు :	175
పీజీ సీట్లు:	72
దంతవైద్య కళాశాల ప్రారంభం:	2008
యూజీ సీట్లు :	100
పీజీ సీట్లు :	23
వైవీయూ ప్రారంభం:	2006
పీజీ విద్యార్థులు:	1500
అనుబంధకళాశాలల్లో:	50,000
వైఎస్సార్‌ఏఎఫ్‌యూ ప్రారంభం:	2020
మొత్తం విద్యార్థులు:	500

100 దంతవైద్య విద్య సీట్లతో ప్రారంభమైన దంత వైద్య కళాశాలలో డీసీఐ 2008లోనే ప్రభుత్వ దంత వైద్య కళాశాలను అనుమతించడంతో పాటు క్లాస్‌లు ప్రారంభమయ్యాయి. 2020లో డాక్టర్ పి. శిల్ప (2017–2020) అనే పీజీ విద్యార్థిని డాక్టర్ వైఎస్ఆర్ హెల్త్ యూనివర్సిటీ టాపర్‌గా నిలిచారు.

అందుబాటులోకి మరో మెడికల్ కళాశాల

కడపలో కొలువైన రిమ్స్, ఫిమ్స్ మెడికల్ కళాశాలతో పాటు, పులివెందుల కేంద్రంగా సుమారు 420ఎకరాల్లో రూ.500కోట్ల వ్యయంతో మరో ప్రభుత్వ మెడికల్ కళాశాల రూపుదిద్దుకుంటోంది. 2019 డిసెంబర్ 25న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మెడికల్ కళాశాల నిర్మాణ పనులకు శిలాఫలకం వేశారు. 30నెలల్లో పనులు పూర్తి చేసేలా ప్రణాళికలు రచించారు. రెండేళ్లపాటు కరోనా వైరస్ కారణంగా పనులు చేపట్టలేదు. తాజాగా పనులు వేగంగా కొనసాగుతున్నాయి. వచ్చే విద్యా సంవత్సరానికి అందుబాటులోకి రానుంది.

జేఎన్‌టీయూ కళాశాల...

గ్రామీణ విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి 2006లో పులివెందులలో జేఎన్‌టీయూ కళాశాలను ప్రారంభించారు. 2013లో వరల్డ్ బ్యాంక్ కళాశాల అభివృద్ధి కోసం రూ.10కోట్ల నిధులు ఇచ్చింది. ప్రతి ఏడాది కళాశాల నుంచి వివిధ రంగాల్లో విద్యార్థులు ఉన్నతోద్యోగాలు పొందుతున్నారు. రాయలసీమ పరిధిలో సాఫ్ట్‌వేర్ రంగంలో రూ.44లక్షల ప్యాకేజీతో ఉద్యోగావకాశాలు పొందిన ఘనత పులివెందుల జేఎన్‌టీయూ విద్యార్థులకే దక్కింది. గేట్‌లో సైతం వీరు సత్తా చాటారు.

ఆర్జీయూకేటీ విశ్వవిద్యాలయం....

ఆర్జీయూకేటీ పరిధిలోని ఇడుపులపాయ ఆర్‌కే వ్యాలీ ట్రిపుల్ ఐటీలో ప్రతి ఏడాది 1100సీట్లను విద్యార్థులు పొందుతున్నారు. మొత్తం ఈ ట్రిపుల్ ఐటీలలో 6560మంది విద్యనభ్యసిస్తున్నారు. ప్రతి ఏటా సరాసరి 600 మంది విద్యార్థులు ప్రపంచ స్థాయి కంపెనీల ఉద్యోగాలకు ఎంపిక అవుతున్నారు.

శ్రీవెంకటేశ్వర పశువైద్య కళాశాల

ప్రొద్దుటూరు కేంద్రంగా 2008 విద్యాసంవత్సరం నుంచి తిరుపతి శ్రీవెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయానికి అనుబంధంగా పశువైద్య కళాశాలను నిర్వహిస్తోన్నారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాలకు సంబంధించి ప్రొద్దుటూరులో వైఎస్ రాజశేఖరరెడ్డి నాలుగో పశు వైద్య కళాశాలను ఏర్పాటు చేశారు. రూ.125 కోట్లతో 75 ఎకరాల విస్తీర్ణంలో దీనిని నిర్మించారు. జాతీయ స్థాయి వర్క్‌షాప్ ఇక్కడ నిర్వహించడం విశేషం.

యోగివేమన విశ్వవిద్యాలయం...

1977లో ఎస్వీయూ పీజీ సెంటర్‌ను మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి 2006 మార్చి 9న యోగివేమన యూనివర్సిటీగా అప్‌గ్రేడ్ చేశారు. 652 ఎకరాల్లో 167 అనుబంధ కళాశాలు, 27 డిపార్టుమెంట్లతో వైవీయూ విస్తరించి ఉంది. 2007లో 2 (ఎఫ్) స్టేటస్ 2011లో 12(బి) హోదా, 2016లో న్యాక్ బీ గ్రేడింగ్ (జీసీపీఏ 2.54), 2018లో ఏపీ గ్రీనింగ్ కార్పొరేషన్‌లో రాష్ట్రంలో ప్రథమస్థానం దక్కింది. 2022లో ఏపీ బయోడైవర్సిటీ అవార్డు దక్కగా, 2022లో న్యాక్ 'ఏ'గ్రేడ్ గుర్తింపు దక్కింది. మొత్తంగా 50,343 మంది విద్యార్థులు వైవియూ మరియూ అనుబంధ కళాశాలల పరిధిలో వివిధ కోర్సులు చేస్తున్నారు.

వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ వర్సిటీ

సీఎం వైఎస్ జగన్ 2020 జనవరి 7న జిల్లాలో వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయాన్ని మంజూరు చేశారు. తొలుత కడప నగరంలోని చలమారెడ్డిపల్లిలోని కొండపైన ఏర్పాటు చేసేందుకు 138 ఎకరాలు కేటాయిస్తూ కేబినెట్ ఆమోదం లభించింది. తాజాగా 110 ఎకరాలు విస్తీర్ణంలో పెండ్లిమర్రి మండలం గంగనపల్లి పరిధిలో వైవీయూ పక్కనే ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు. 14 కోర్సులతో కొనసాగుతున్న యూనివర్సిటీకి 2021లో విశ్వవిద్యాలయానికి 2(ఎఫ్) గుర్తింపు దక్కింది.

న్యూస్‌రీల్

208 మంది గైర్హాజరు

రాయచోటి: జిల్లాలో పదోతరగతి పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. శనివారం ఇంగ్లీషు పరీక్ష జరిగింది. అన్నమయ్య జిల్లా పరిధిలోని 123 కేంద్రాల్లో 22417 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉంది. అయితే 22208 మంది హాజరు కాగా 208 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఈఓ పురుషోత్తం తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో అన్ని మౌళిక వసతులు కల్పించినట్లు చెప్పారు. ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు జిల్లాలోని కేంద్రాలను పరిశీలించినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. జిరాక్స్ సెంటర్లను కూడా మూయించారు. ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.

11న జాబ్‌మేళా

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో ఈనెల 11వ తేదిన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి దీప్తి ఒక ప్రకటనలో తెలిపారు. అమరరాజా కంపెనీలో మిషన్ ఆపరేటర్ ఉద్యోగానికి ఐటీఐ పూర్తిచేసిన పురుష అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తిగల వారు మంగళవారం ఉదయం 10 గంటలకు విద్యార్హతల ధ్రువీకరణపత్రాలు, ఫోటోలు తీసుకు రావాల్సి ఉంటుందన్నారు.ఆసక్తిగల వారు తమ వివరాలు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎన్‌సీఎస్.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 79891 12118 నంబరులో సంప్రదించాలని తెలిపారు.

హత్య ఘటనలో ఏడుగురిపై కేసు

కమలాపురం: వైఎస్సార్ జిల్లా కమలాపురంలో వైఎస్సార్ సీపీ నాయకుడు శంకర్ రెడ్డి హత్య కేసులో ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ సత్యబాబు శనివారం తెలిపారు. హతుడు శంకర్ రెడ్డి రెండో కుమారుడు నవీన్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని, నిందితులను త్వరలో పట్టుకుని అరెస్ట్ చేస్తామని సీఐ తెలిపారు.

జగనన్న విద్యాకానుక పంపిణీకి ఏర్పాట్లు



రాయచోటి: విద్యాశాఖ అధికారులతో మాట్లాడుతున్న ఎంవీ కృష్ణారెడ్డి

రాయచోటి/చిన్నమండెం: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వసరులు కల్పించడంలో భాగంగా అమలు చేస్తున్న జగనన్న విద్యాకానుక (జేవీకే) కిట్ల పంపిణీకి పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు అన్నమయ్య జిల్లా జేవీకే–4 ప్రత్యేక అధికారి ఎంవీ కృష్ణారెడ్డి తెలిపారు. శనివారం అన్నమయ్య జిల్లా రాయచోటిలోని ప్రభుత్వ పాఠశాలలను ఆయన స్థానిక అధికారులతో కలిసి పరిశీలించారు. నాలుగో సంవత్సరం ప్రభుత్వం సరఫరా చేసే జగనన్న విద్యాకానుకలోని వస్తువులను నిల్వజేసే మండల కేంద్రాలను శనివారం ఉదయం నుంచి పరిశీలించినట్లు కృష్ణారెడ్డి తెలిపారు. కలికిరి, వాల్మీకిపురం, కురబలకోట, మదనపల్లి, గుర్రంకొండ, చిన్నమండెం, రాయచోటి మండల నిల్వ కేంద్రాలున్నాయన్నారు. జగనన్న విద్యాకానుక వస్తువులను నిల్వ చేయడానికి మండల విద్యాశాఖ అధికారులు గుర్తించిన నిల్వ కేంద్రాలు భద్రతపరంగా సురక్షితమైనవా?, వర్షాకాలంలో వస్తువులు తడిసే అవకాశం ఉందా వంటి విషయాలను పరిశీలించామన్నారు. 1నుంచి 10వ తరగతిచదువుతున్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఈ కిట్లను సకాలంలో అందేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

అన్నమయ్య జిల్లా ఎస్పీ బదిలీ

- నూతన ఎస్పీగా గంగాధర్ రావు



హర్షవర్ధన్ రాజు



గంగాధర్ రావు

రాయచోటి: అన్నమయ్య జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు బదిలీ అయ్యారు. ఈయనను సీఐడీ ఎస్పీగా నియమిస్తూ శనివారం ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఏసీబీ ఎస్పీగా పని చేస్తున్న ఆర్. గంగాధర్ రావు అన్నమయ్య జిల్లా ఎస్పీగా నియమితులయ్యారు. ఈయన త్వరలోనే బాధ్యతలు స్వీకరించనున్నారు. అన్నమయ్య జిల్లా ఏర్పడిన తర్వాత మొదటి ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన హర్షవర్ధన్ రాజు శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేశారు. జిల్లా ప్రజల మన్ననలను పొందారు.

కడప కేంద్ర కారాగారానికి నిందితుల తరలింపు

కడప అర్బన్: డాక్టర్ అచ్చెన్న హత్య కేసులో అరెస్టయిన ముగ్గురు నిందితులను విచారించేందుకు పోలీసులు వారిని ఈ నెల 6 నుంచి 8 వరకు కస్టడీకి తీసుకున్నారు. వారి కస్టడీ సమయం ముగియడంతో శనివారం వారిని మళ్లీ కడప కేంద్ర కారాగారం తరలించారు.

నిత్యాన్నదానానికి విరాళం

చక్రాయపేట: గండి క్షేత్రంలో వెలసిన వీరాంజనేయ స్వామి సన్నిధిలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన పథకానికి శనివారం రు.1,00,116లు విరాళంగా అందినట్లు ఆలయ సహాయ కమిషనర్ ముకుందారెడ్డి తెలిపారు. సీకె దిన్నె మండలం ఊటుకూరు గ్రామానికి చెందిన చీమల సూర్యభాస్కరరెడ్డి సతీమణి కుమారి కుటుంబ సభ్యులతో వచ్చి విరాళం ఇచ్చారని చెప్పారు. ఆలయ చైర్మన్ రాఘవేంద్ర ప్రసాద్ దాతలకు శేషవస్త్రం, స్వామి వారి చిత్రపటం బహూకరించినట్లు చెప్పారు.

యువకుడిపై పోక్సో కేసు

ముద్దనూరు: పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి ఓ బాలికను మోసగించిన గంగాప్రసాద్ అనే యువకుడిపై ముద్దనూరు పోలీసులు శనివారం పోక్సో కేసు నమోదు చేసారు. తనకు పెళ్లయిన విషయం దాచిపెట్టి సదరు బాలికతో గంగాప్రసాద్ శారీరక సంబంధం పెట్టుకున్నాడు. కొంతకాలం నుంచి తనను ఎపుడు పెళ్లి చేసుకుంటావంటూ బాలిక అతడిని నిలదీయసాగింది. చివరకు గంగాప్రసాద్ తనకు పెళ్లయిందని, ఆమెను పెళ్లి చేసుకోలేనని చెప్పాడు. కుటుంబసభ్యులకు బాలిక విషయం తెలపడంతో వారు పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు గంగాప్రసాద్‌పై పోక్సో కేసు నమోదు చేసి పోలీసులు విచారణ జరుపుతున్నారు.

రోడ్డెక్కనున్న ఎలక్ట్రిక్ బస్సులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప–తిరుపతి మధ్య తిరిగే ఎలక్ట్రికల్ బస్సులు త్వరలో రోడ్డెక్కనున్నాయి. ఇందులో భాగంగా శనివారం తిరుపతి నుంచి ఓ ఎలక్ట్రిక్ బస్సు కడప చేరుకుంది. ఈ సందర్భంగా సీటీఎం లక్ష్మిభాస్కర్, ట్రైనర్ జబ్బార్ బస్సు నడిపే విధానంపై డ్రైవర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప–తిరుపతి మధ్య త్వరలో 12 బస్సులు రాకపోకలు సాగించనున్నాయన్నారు. ప్రయాణికులకు అనుకూలంగా, సౌకర్యవంతంగా ఈ బస్సులు ఉంటాయన్నారు.

చక్రస్నాన వీక్షణం.. సర్వపాపహరణం

పుష్కరిణిలో భక్తుల పుణ్యస్నానాలు



పుష్కరిణిలో చక్రస్నాన ఘట్టాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు



చక్రస్నానం కోసం పుష్కరిణీలో దిగిన భక్తులు

ఒంటిమిట్ట: ఏకశిలానగరి కోదండ రాముడి బ్రహ్మోత్సవాలు తొమ్మిది రోజులు వైభవంగా జరిగాయి. లక్షల మంది భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. బ్రహ్మోత్సవాల ముగింపు దశలో కీలకమైన చక్రస్నానాన్ని శనివారం కనుల పండువగా నిర్వహించారు. ఆలయంలో శనివారం ఉదయం సుప్రభాత సేవ జరిపారు. భక్తుల సర్వదర్శనానికి అనుమతిచ్చారు. సీతారామలక్ష్మణ దివ్య మూర్తులను పట్టువస్త్రాలు, ఆభరణాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. 10 గంటలకు సుదర్శన చక్రత్తాళ్వార్‌ను పల్లకిలో ఆలయం ఎదురుగా నిర్మించిన నూతన పుష్కరిణికి తీసుకొచ్చారు. 10 నుంచి 11 గంటల వరకు సీతారామలక్ష్మణ ఉత్సవ మూర్తులకు ఉత్సవ కంకణదారు రాజేష్ ఆధ్వర్యంలో స్నపనతిరుమంజనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. 11 నుంచి 11:30 గంటల వరకు అర్చకులు వేదమంత్రోచ్చారణలతో చక్రస్నాన కార్యక్రమాన్ని నిర్వహించారు. టీటీడీ అధికారులు, ఉద్యోగులు సిబ్బంది, కళాకారులు, భక్తులు పుణ్యస్నానాలు చేశారు. పుష్కరిణి నుంచి ఆలయ మాడ వీధుల్లో ఊరేగింపు నేత్రపర్వంగా సాగింది. స్వామివారు ముంగిట్లోకి రావడంతో భక్తులు కాయకర్పూరం సమర్పించారు. హారతులు అందుకున్నారు. శనివారం రాత్రి అర్చకులు ధ్వజావరోహణ కార్యక్రమం నిర్వహించారు.కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో నటేష్ బాబు, సూపరిటెండెంట్ వెంటేశయ్య, ఇన్‌స్పెక్టర్ ధనుంజయుడు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కమలాపురం ఉరుసు



ఊరేగింపులో పీఠాధిపతి, సోదరులు, భక్తులు



కమలాపురం పట్టణంలో సాగుతున్న తహలిల్ ఊరేగింపు

కమలాపురం: వైఎస్సార్‌జిల్లా కమలాపురంలో వెలసిన శ్రీ హజరత్ అబ్దుల్ గఫార్ షా ఖాద్రి, హజరత్ దస్తగిరి షా ఖాద్రి, హజరత్ మౌలానా మౌల్వీ ఖాదర్ మొహిద్దీన్ షా ఖాద్రి, హజరత్ జహీరుద్దీన్ షా ఖాద్రి ఉరుసు మహోత్సవాలు ముగిశాయి. ఈ నెల 5వ తేదీ నుంచి దర్గా పీఠాధిపతి (ముతవల్లి) సజ్జాద్–ఏ–నషీన్ మహమ్మద్ ఫైజుల్ గఫార్ షా ఖాద్రి ఆధ్వర్యంలో జరుగుతున్న ఉత్సవాలు శనివారం తహలిల్ కార్యక్రమంతో ముగిశాయి. ఉదయం స్థానిక పాత బస్టాండు సమీపంలోని గంధం ఇంటి నుంచి పీఠాధిపతి ఆధ్వర్యంలో పూలచాదర్‌ను ప్రత్యేకంగా అలంకరించిన చాందినిలో ఊరేగింపుగా దర్గాకు తీసుకువచ్చారు. బాణా సంచా పేల్చుతూ డప్పు వాయిద్యాల మధ్య యువత నత్యాలు చేశారు. అనంతరం దర్గాలో వెలసిన స్వాముల వారి మజార్లపై పూల చాదర్‌లు సమర్పించి ప్రత్యేక ఫాతెహా నిర్వహించారు. భక్తులకు ప్రసాదాలు పంచిపెట్టారు. అనంతరం నషాన్ రోజున దర్గా ఆవరణంలో ఆవిష్కరించిన జెండాను తొలగించారు. దీంతో ఉరుసు మహోత్సవాలు ముగిశాయి. ఈ కార్యక్రమంలో పీఠాధిపతి సోదరులు దస్తగిరి షా ఖాద్రి, మౌలానా ఖాద్రి, గౌస్ పాక్, జియా, ఇస్మాయిల్, సర్ఫరాజ్, పెద్ద సంఖ్యలో భక్తులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

'ఒంటరిగా పోటీ చేసే దమ్ముందా?'


కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు : వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీకి గానీ, జనసేనకు గానీ ఒంటరిగా పోటీ చేసే దమ్ముందా? అని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు ప్రశ్నించారు. రైల్వేకోడూరులో ఆయన శనివారం విలేకర్లతో మాట్లాడారు. ఇటీవల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ మూడు స్థానాలు గెలిచినంత మాత్రానా.. అవాకులు, చెవాకులు పేలడం సరికాదన్నారు. మొదటి ప్రాధాన్యత ఓట్లు తమకే ఎక్కువ వచ్చాయని, రెండో ప్రాధాన్యత ఓట్లతో టీడీపీ గట్టెక్కిందని గుర్తు చేశారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలోని మొత్తం 175 స్థానాల్లో వైఎస్సార్‌సీపీ విజయ ఢంకా మోగిస్తుందని అన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన పవన్‌కళ్యాణ్ ఇంతకాలం ముసుగు వేసుకుని ఉన్నారని, ఇప్పుడు తొలగించి బయటకు వచ్చినా సాధించేదేమీ లేదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, ఏపీ టూరిజం డైరెక్టర్ సాయికిషోర్‌రెడ్డి, రాష్ట్ర ప్రచార కార్యదర్శి సీడీ నాగేంద్ర పాల్గొన్నారు.

విచ్చలవిడిగా కర్ణాటక మద్యం అమ్మకం


అంగన్‌వాడీ భవనంలో మద్యం ప్యాకెట్లు శుభ్రం చేస్తున్న సిబ్బంది

రామసముద్రం : మండలంలోని చెంబకూరు పంచాయతీ దిన్నిమీద ఎగువదళితవాడ గ్రామంలో కర్ణాటక మద్యం ఏరులై పారుతోంది. ఈ నేపథ్యంలో స్థానిక అంగన్‌వాడీ భవనంలో మద్యం సేవించి, అక్కడే ప్యాకెట్లు పడేస్తున్నారు. ఇదివరకే గ్రామంలో ఒకరు మద్యం తాగడం వల్ల మృతి చెందారు. అంగన్‌వాడీ భవనం ఆవరణలో బహిర్భూమికి పాల్పడుతున్నారు. అక్కడ ఆయాగా పని చేస్తున్న బాయమ్మ పలు మార్లు గ్రామస్తులకు తెలియజేస్తూ, శుభ్రం చేస్తూ అసహనం వ్యక్తం చేశారు. పుంగనూరు, మదనపల్లె ఎక్సైజ్ అధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని స్థానికులు వాపోతున్నారు. అంగన్‌వాడి భవనంలో చదువుతున్న చిన్నపిల్లలు అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లకుండా తీవ్ర అసహనానికి గురౌతున్నారు. ఇప్పటికైనా ఎక్సైజ్ శాఖ, పోలీస్ అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రాజ్యాంగంతోనే ప్రజాస్వామ్య పరిరక్షణ

- బీజేపీ వ్యతిరేక శక్తులు ఏకం కావాలి
- రాజ్యాంగ విలువలను, ప్రాధాన్యతను తగ్గిస్తున్న బీజేపీ
- మదనపల్లెలో వీసీకే పార్టీ ప్రథమ రాష్ట్ర మహాసభ



సమావేశంలో మాట్లాడుతున్న వీసీకే పార్టీ జాతీయ అధ్యక్షులు, ఎంపీ తిరుమావళవన్

మదనపల్లె : బీజేపీ ఎనిమిదేళ్ల పరిపాలనలో లౌకిక, ప్రజాస్వామ్య, వాదాలకు ప్రమాదం ఏర్పడిందని, రాజ్యాంగంతో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకునేందుకు, సనాతన శక్తుల్ని ఒంటరి చేసి ప్రజాస్వామ్యశక్తులు ఏకం కావాలని వీసీకే పార్టీ జాతీయఅధ్యక్షులు, ఎంపీ డాక్టర్.తిరుమావళవన్ వ్యాఖ్యానించారు. అన్నమయ్యజిల్లా మదనపల్లెలో శనివారం వీసీకే పార్టీ ఆంధ్రప్రదేశ్ ప్రథమ మహాసభలో భాగంగా రాజ్యాంగ రక్షణ రణభేరి సమావేశాన్ని నిర్వహించారు. వీసీకే పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీటీఎం.శివప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రజాయుద్ధనౌక గద్దర్, సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శులు రామకృష్ణ, శ్రీనివాసరావు, కర్నాటక మాజీ స్పీకర్ రమేష్‌కుమార్, తెలుగురాష్ట్రాల వీసీకే ఇన్‌చార్జ్ బాలసింగం, రాష్ట్ర అధ్యక్షులు విద్యాసాగర్, తమిళనాడు వీసీకే ఎమ్మెల్యేలు రవికుమార్, సింథవై సెల్వన్, ఎస్.ఎస్.బాలాజీ, మహ్మద్ షానవాజ్, బాబు, తెలంగాణ వీసీకే అధ్యక్షులు జిలుకర శ్రీనివాస్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వీసీకే జాతీయ అధ్యక్షులు తిరుమావళవన్ మాట్లాడుతూ.... మదనపల్లెలో 2018 జనవరి 26న రాజ్యాంగాన్ని కాపాడుకుందాం నినాదంతో తొలి సమావేశం ఏర్పాటుచేశామని, రెండోసారి నిర్వహిస్తున్న మహాసభకు కాంగ్రెస్, వామపక్షాలు, ప్రజాసంఘాల నాయకులు హాజరై వీసీకేతో కలిసి పోరాటాలకు మద్దతు తెలపడం శుభపరిణామమన్నారు. తమ కలయిక రాజకీయ లబ్ధి కోసం కాదని, ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకే అన్నారు. దేశాన్ని పాలిస్తున్న వ్యక్తులు ప్రమాదకరమైన వారు కావడంతో రాజ్యాంగాన్ని రక్షించుకోవాలన్న ఆశయంతో వీసీకే పనిచేస్తోందన్నారు. బీజేపీ ఎనిమిదేళ్ల పాలనలో ప్రజాస్వామ్యవిలువలు ధ్వంసమయ్యాయన్నారు. దేశాన్ని పాలిస్తోంది బీజేపీ కాదని, దాని ముసుగులో ఆర్‌ఎస్‌ఎస్ రహస్య అజెండాను అమలుచేస్తోందన్నారు. హిందుత్వ ముసుగులో దేశాన్ని విభజించు, పాలించు సిద్ధాంతంతో మైనారిటీలు, క్రైస్తవులు,దళితుల మధ్య చిచ్చురేపుతూ, ద్వేషాన్ని పెంచుతూ పాలన సాగిస్తోందన్నారు. బీజేపీ వ్యతిరేక శక్తులన్నీ ఏకమై మోదీ పాలనకు చరమగీతం పాడుదామని పిలుపునిచ్చారు. ప్రజాయుద్ధనౌక గద్దర్ తనదైన శైలిలో ఆటపాటల ద్వారా దేశంలో వేళ్లూనుకుపోయిన కులకట్టుబాట్లను, నిచ్చెనమెట్ల వ్యవస్థను కళ్లకు కట్టినట్లు తెలియజేశారు. భారతరాజ్యాంగం ఒక పుస్తకం కాదని, ఏడు తరాల త్యాగాల జ్ఞానసిద్ధాంతంగా వ్యాఖ్యానించారు. 18–25 ఏళ్ల వయస్సు కలిగిన యువకులు ఇంటింటికీ వెళ్లి భారతరాజ్యాంగాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. కర్నాటక మాజీ స్పీకర్, ఎమ్మెల్యే రమేష్‌కుమార్ మాట్లాడుతూ.. రాజ్యాంగం ప్రతి ఒక్కరి అభిప్రాయాలను వ్యక్తపరిచే స్వాతంత్ర్యం ఇస్తే.. దానికి అపాయం ఏర్పడేలా బీజేపీ వ్యవహరిస్తోందన్నారు. రాహుల్‌గాంధీ కోలార్‌లో మాట్లాడిన వ్యాఖ్యలపై గుజరాత్‌లో కేసు పెట్టడమే దీనికి ఉదాహరణ అన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ..కేంద్రంలో అధికారంలో ఉన్న పాలకులు రాజ్యాంగాన్ని, పార్లమెంట్‌ను, ప్రతిపక్షాలను గౌరవించడం లేదన్నారు. 140 కోట్ల జనాభా కలిగిన భారతదేశంలో లక్షల కోట్ల బడ్జెట్ సమావేశం సందర్భంగా పార్లమెంట్‌లో కనీసం గంటసేపైనా చర్చలేకుండా ఆమోదించడం రాజ్యాంగంపై గౌరవం లేదనేందుకు నిదర్శనమన్నారు. అదానీ కుంభకోణంపై 21 రాజకీయపార్టీలు జాయింట్ పార్లమెంటరీ కమిటీ వేయాలని కోరుతున్నా బీజేపీ మొండిగా వ్యవహరిస్తోందన్నారు. 76 ఏళ్ల స్వతంత్ర్య భారతావనిలో ఎన్నడూ లేనంతగా బీజేపీ ఎనిమిదేళ్ల పాలనలో దేశ రాజ్యాంగం, లౌకిక, ప్రజాతంత్రవాదానికి ప్రమాదం ఏర్పడిందన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు మాట్లాడుతూ... బీజేపీ వ్యతిరేక శక్తులు ఏకమై దేశాన్ని రక్షించుకోవాల్సిన సమయం ఆసన్నమైందని పిలుపునిచ్చారు. బీజేపీ లౌకిక, ప్రజాస్వామ్య, రిపబ్లిక్ రాజ్యాంగాన్ని తుంగంలో తొక్కి మనువాదాన్ని పునఃప్రతిష్టించి సమాజంలో బ్రాహ్మణ ఆధిపత్యాన్ని తీసుకువచ్చే దిశగా కృషిచేస్తోందన్నారు. కార్పొరేట్ మతోన్మాద రాజ్యాన్ని సృష్టించేందుకు ప్రయత్నిస్తున్న మోదీకి, బీజేపీకి దేశాన్ని పాలించే అర్హత లేదన్నారు. దేశాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకునేందుకు ప్రగతిశీల, లౌకిక, ప్రజాస్వామ్యవాదులంతా ఒకేతాటిపైకి రావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో భాగంగా ప్రజాసంఘాల నాయకులు గద్దర్, కత్తిపద్మారావు, చంద్రప్రసాద్ భార్యలైన విమల, స్వర్ణకుమారి, చంద్రకుమారి త్యాగిలకు అంబేద్కర్ సతీమణి మాతా రమాబాయి సత్కారాలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో చదలవాడ సుచరిత, వై.హరిబాబు, మోహన్‌కుమార్ ధర్మ, సీఎస్‌ఐ బిషప్ ఐజాక్‌వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాల పేరుతో కుచ్చుటోపి

- ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన
- పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన బాధితులు
- టీటీడీ పేరుతో నకిలీ జాయినింగ్ ఆర్డరు, ఐడెంటిటీ కార్డులు


పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న బాధితులు

కేవీపల్లె : ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులకు మోసం చేసి కుచ్చుటోపి పెట్టిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. కొందరు బాధితులు శనివారం కేవీపల్లె పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పలు విషయాలు వెలుగులోకి వచ్చాయి. బాధితుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కేవీపల్లె మండలం గర్నిమిట్ట పంచాయతీ బలిజపల్లెకు చెందిన తొగురు రెడ్డిదినేష్‌కుమార్ మరికొందరితో కలసి ముఠాగా ఏర్పడి సులభంగా డబ్బు సంపాదించాలనే దురాశతో నిరుద్యోగులకు వల వేశాడు. 2017లో కేవీపల్లె మండలంలోని పలువురు నిరుద్యోగ యువకులకు టీటీడీలో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ నమ్మబలికాడు. డబ్బులు ఇస్తే ఉద్యోగం గ్యారెంటి అని నమ్మించి ఒక్కొక్కరి వద్ద రూ.10 లక్షలకు పైగా వసూలు చేశాడు. నిరుద్యోగులకు టీటీడీ పేరుతో జాయినింగ్ ప్రొసీడింగ్ లెటరు ఇవ్వడంతో వారు నమ్మారు. కొందరిని తిరుమలకు తీసుకెళ్లి పార్కుల వద్ద చెట్టు కింద కూర్చోబెట్టి ఇక్కడే మీరు విధులు నిర్వహించాల్సింది, మీది సులభమైన ఉద్యోగం పార్కును పర్యవేక్షిస్తూ ఉండాలి అంతే అని నమ్మించారు. మూడు నెలల పాటు కొందరికీ నకిలీ సాలరీ రిపోర్టు స్లిప్ ఇచ్చారు. అంతేగాక కొందరి ఖాతాలకు రూ.33,983 చొప్పున మూడు నెలలు జమ చేశారు. జీతాలు వచ్చాయని వీరి ద్వారా తెలుసుకున్న మరికొందరు నిరుద్యోగ అమాయకులు రూ.లక్షల్లో డబ్బులు ముట్టజెప్పారు. అయితే కొంత కాలానికి ఉద్యోగాలు లేవు ఏమి లేదు, ఇచ్చిన పత్రాలు అన్నీ నకిలీవని తెలుసుకున్న బాధితులు అప్పట్లో తిరుమలలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో మోసానికి పాల్పడ్డ రెడ్డిదినేష్‌కుమార్ పథకం ప్రకారం కువైట్‌కు ఉడాయించాడు. ఐదేళ్ల తరువాత స్వగ్రామానికి రావడంతో బాధితులు తెలుసుకుని ఎలాగైనా తమ డబ్బులు ఇప్పించాలని పోలీసులను ఆశ్రయించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో కేవీపల్లె మండలమే గాక ఇతర మండలాల్లోనూ బాధితులు భారీగా ఉన్నట్లు తెలుస్తోంది.

ఇద్దరు మహిళలు ఆత్మహత్య

మదనపల్లెలో ఒకరు, రామసముద్రంలో మరొకరు


అమరావతి (ఫైల్)


అశ్విని మృతదేహం

మదనపల్లె : నియోజకవర్గంలోని వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు మహిళలు ఆత్మహత్య చేసుకున్నారు. మదనపల్లెలో శుక్రవారం రాత్రి ఓ వివాహిత ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు.. మదనపల్లె మండలం కొత్తపల్లెకు చెందిన అమరావతి (35)కి 16 ఏళ్ల క్రితం కర్ణాటకకు చెందిన శ్రీనివాస ఆచారితో వివాహమైంది. ఆమెకు ఇద్దరు సంతానం కలరు. వీరు కూలీ పనులు చేస్తూ జీవిస్తున్నారు. అమరావతి ఇటీవల ఓ వ్యక్తితో వెళ్లిపోవడంతో కర్ణాటక పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేసి ఆమెను వెతికి తీసుకొచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు. దీంతో శ్రీనివాస ఆచారి వారం క్రితం భార్యను తెచ్చి పుట్టింటిలో వదిలి వెళ్లారు. అమరావతి తల్లి శాంతమ్మ గత కొన్ని సంవత్సరాలుగా పట్టణంలోని ఎస్‌బీఆర్ లేఔట్‌కు చెందిన డాక్టర్ గంగాదేవి ఇంట్లో పని మనిషిగా పని చేస్తోంది. ఈ క్రమంలో తల్లి శాంతమ్మ కుమార్తె అమరావతి ఇద్దరూ పనులు చేసేందుకు డాక్టర్ ఇంటికి వెళ్లారు. అక్కడ తల్లితో కుటుంబ విషయమై గొడవ పడిన అమరావతి మనస్తాపం చెంది, గదిలోకి వెళ్లి చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. అయితే డాక్టర్‌కు, తల్లీ కుమార్తెల మధ్య ఆర్థిక వివాద గొడవలు జరగడంతో అమరావతి ఆత్మహత్య చేసుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి. ఇందులో భాగంగా మహిళ ఆత్మహత్య చేసుకున్న విషయాన్ని పోలీసులకు సమాచారం అందించకుండా రాత్రి వరకు గోప్యంగా ఉంచారు. చివరకు పోలీసులకు తెలియడంతో వారు రంగ ప్రవేశం చేసి మృతదేహాన్ని జిల్లా ఆసుపత్రికి తరలించారు. కుటుంబ విషయమై తల్లితో గొడవ పడి జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకుందని బాధితురాలి కుటుంబ సభ్యులు తెలిపారు. డాక్టర్ ఇంట్లో మహిళ ఆత్మహత్యకు పాల్పడటం పట్టణంలో చర్చనీయాంశమైంది.

పురుగుల నివారణ మందు తాగి..

రామసముద్రం : పురుగుల నివారణ మందు తాగి యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం రామసముద్రంలో చోటుచేసుకుంది. మృతురాలి కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. రామసముద్రంలో నివాసం ఉంటున్న దంపతులు శివయ్య, జయలక్ష్మీల కుమార్తె అశ్విని (23) డిగ్రీ వరకు చదుకుని ఇంటిపట్టునే ఉంటోంది. అయితే అశ్విని తల్లిదండ్రులు మందలించారని పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. కుటుంబీకులు గమనించి చికిత్స నిమిత్తం మదనపల్లె జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రి అత్యవసర విభాగం వైద్యులు చికిత్సలు అందించారు. అయినా పరిస్థితి విషమించడంతో మృతి చెందింది. అశ్విని ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదని ఎస్‌ఐ రవీంద్రబాబు తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు


గాయపడిన విద్యార్థి నందకిషోర్


గాయపడ్డ హిమబింధు

మదనపల్లె : వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు గాయపడ్డారు. విద్యుత్ షాక్‌తో పదో తరగతి విద్యార్థికి తీవ్ర గాయాలైన సంఘటన మదనపల్లె పట్టణంలో శనివారం జరిగింది. పుంగనూరు మండలం యల్లారుబైలు గ్రామానికి చెందిన భాస్కర్‌నాయుడు మదనపల్లె పట్టణంలో హాస్టల్ నడుపుతూ జీవిస్తున్నాడు. అతని కుమారుడు నందకిషోర్ (15) స్థానికంగా ప్రైవేటు స్కూల్‌లో పదో తరగతి చదువుతున్నాడు. ఉదయం పరీక్షకు హాజరై ఇంటికి వచ్చాడు. భోజనం అనంతరం మధ్యాహ్నం తాము ఉంటున్న ఇంటి వద్ద ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. ఘటనలో విద్యార్థి తీవ్రంగా గాయపడగా గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులు హుటాహుటిన ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. వైద్య చికిత్సల అనంతరం మెరుగైన వైద్యానికి బెంగళూరు సెయింట్‌జాన్స్‌కు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు..

రోడ్డు ప్రమాదంలో మహిళ తీవ్రంగా గాయపడిన సంఘటన శనివారం పెద్దమండ్యంలో జరిగింది. మండలంలోని మందలవారిపల్లె పంచాయతీ దండువారిపల్లెకు చెందిన సురేంద్ర భార్య డి.హిమబింధు (30) ఆటోలో పెద్దమండ్యం నుంచి కొటాలకు వస్తుండగా.. చెరువుకిందపల్లె వద్ద ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఆమె తీవ్రంగా గాయపడగా స్థానికులు తంబళ్లపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి 108 వాహనంలో వచ్చారు. అయితే ముసలికుంటకు చెందిన ఆటో డ్రైవర్ మద్యం మత్తులో వాహనాన్ని వేగంగా నడపడంతో ఆటో బోల్తాపడినట్లు బాధితురాలు తెలిపింది. పెద్దమండ్యం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళపై దాడి


గాయపడ్డ నరసమ్మ

మదనపల్లె : గొడవలో భాగంగా అడ్డుపడిన మహిళపై కొందరు వ్యక్తులు మూకుమ్మడిగా దాడి చేసి బంగారు నగలు, నగదు లాక్కెళ్లిన ఘటన శుక్రవారం రాత్రి కురబలకోట మండలంలో జరిగింది. బాధితురాలు తెలిపిన మేరకు వివరాలు.. మదనపల్లె మండలం కొండామర్రిపల్లె పంచాయతీ సత్యసాయికాలనీకి చెందిన శ్రీనివాసులు భార్య నరసమ్మ (50) కూలీ పనులు చేస్తూ జీవిస్తోంది. ఇటీవల తన పుట్టినిల్లు అయిన కురబలకోట మండలం నల్లగుట్లపల్లె దళితవాడకు వెళ్లింది. ఈ క్రమంలో ఆమె సోదరుడు శంకర, అదే గ్రామానికి చెందిన యల్లమ్మ కుమారుడు నరసింహులు, వేణుగోపాల్ ద్వారా అప్పు చెల్లించే విషయమై గొడవ పడుతుండగా నరసమ్మ అడ్డుపడుతోంది. దీంతో ఆవేశానికి గురైన నరసింహులు, వేణుగోపాల్, మరికొందరు కలిసి మూకుమ్మడిగా ఆమెపై దాడి చేశారు. చెవి తెగిపోయి తీవ్రంగా గాయపడింది. తన ఎడవ చెవిలో ఉన్న బంగారు కమ్మ, పరుసులోని రూ.20 వేలు నగదు లాక్కెళ్లినట్లు బాధితురాలు తెలిపింది. ఆమెను 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. ముదివేడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దాడి ఘటనలో ఐదుగురిపై కేసు

నిమ్మనపల్లె : ఓ కుటుంబంపై దాడికి పాల్పడిన ఘటనలో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ రమేష్‌బాబు తెలిపారు. గత మార్చి 26వ తేదీన వెంగంవారిపల్లె పంచాయతీ బాలియనిపల్లెలో జరిగిన చౌడేశ్వరీదేవి జాతరకు మదనపల్లెకు చెందిన అమరావతి భర్త వెంకటరమణతో కలిసి బంధువుల ఇంటికి వచ్చింది. తిరుగు ప్రయాణంలో కొమ్మిరెడ్డిగారిపల్లె సమీపంలో మదనపల్లెకు చెందిన చెంగల్రాయుడు అతని భార్య రమాదేవి, కుమారుడు బాలాజీ, నవీన్, కుమార్తె జయంతి కలిసి అమరావతి కుటుంబ సభ్యులపై దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో గాయపడిన అమరావతి మదనపల్లె ప్రభుత్వాసుపత్రిలో చికిత్సలు పొందింది. మెరుగైన చికిత్సల కోసం స్విమ్స్ ఆసుపత్రిలో చేరింది. శనివారం దాడి ఘటనపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆ మేరకు నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

పుట్టెడు దుఃఖంలోనూ పరీక్షకు హాజరు


విద్యార్థి కార్తీక్‌రెడ్డి

మదనపల్లె సిటీ : తండ్రి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. తండ్రి లేడన్న నిజం తెలిసినా గుండె రాయి చేసుకుని పుట్టెడు దుఃఖంలోనూ ఓ విద్యార్థి పరీక్షకు హాజరయ్యాడు. ఈ సంఘటన అన్నమయ్య జిల్లా మదనపల్లె పట్టణంలో శనివారం జరిగింది. శ్రీసత్యసాయి జిల్లా తనకల్లు మండలం కనసానివారిపల్లెకు చెందిన శ్రీనివాసులురెడ్డి పట్టణంలో థియేటర్ల వద్ద తినుబండారాలు విక్రయించే దుకాణాలను లీజుకు తీసుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో గ్రామంలో అమ్మవారి ఆలయ నిర్మాణానికి తన వంతు సహకారం అందిస్తున్నారు. ఈ నెల 7వతేదీ రాత్రి గ్రామంలో అమ్మవారి ఆలయానికి పెయింట్లు తీసుకొచ్చేందుకు అదే గ్రామానికి చెందిన చంద్రశేఖరరెడ్డితో కలిసి కదిరికి వెళ్లాడు. రాత్రి పెయింట్లను తీసుకుని వస్తుండగా మార్గంమధ్యలో బోలేరో వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనంలో ఉన్న ఇద్దరూ మృత్యువాత పడ్డారు. వీరిలో శ్రీనివాసులురెడ్డి కుమారుడు కార్తీక్‌రెడ్డి మదనపల్లెలోని తన అవ్వ వద్ద ఉంటూ స్థానిక సొసైటీకాలనీలోని విజయభారతి పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. తండ్రి మృతి చెందిన విషయం తెలుసుకుని కన్నీటి పర్యంతమయ్యాడు. తండ్రి మృతదేహం కదిరి ఆస్పత్రిలో ఉండగా మదనపల్లెలో పరీక్షకు హాజరయ్యాడు. ఈ విషయం తెలుసుకున్న విజయభారతి పాఠశాల కరస్పాండెంట్ ఎన్.సేతు విద్యార్థిని పరామర్శించారు.

'ఎర్ర' దుంగల స్వాధీనం


వాహనం, ఎర్రచందనం దుంగలతో అధికారులు

పీలేరు : వాహనంతో సహా రూ.8 లక్షల విలువైన ఎర్రచందనం స్వాధీనం చేసుకున్నట్లు పీలేరు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఎస్.వెంకటరమణ తెలిపారు. ఎర్రచందనం అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారంతో శనివారం తలపుల పంచాయతీ దేవరకొండ మూలపల్లె సమీపంలో వాహనాలు తనిఖీ చేశారు. శనివారం తెల్లవారుజామున వచ్చిన కారును ఆపే ప్రయత్నం చేశారు. అయితే డ్రైవర్ వేగంగా ముందుకు తీసుకెళ్లి రోడ్డుపక్కన ఆపి చీకట్లో పరారయ్యాడు. వాహనాన్ని తనిఖీ చేయగా 180 కేజీల బరువుగల ఆరు ఎర్రచందనం దుంగలు ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడిలో ఫారెస్ట్ సిబ్బంది కుప్పుస్వామి, ప్రభుతేజ పాల్గొన్నారు.

అంతర్‌రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

పిక్ పాకెటింగ్, సెల్‌ఫోన్ల చోరీ


నిందితుల అరెస్ట్ చూపుతున్న సీఐ మురళీకృష్ణ

మదనపల్లె : ఓ వైపు సెల్‌ఫోన్ల చోరీ, మరోవైపు పిక్ పాకెటింగ్‌కు పాల్పడుతున్న అంతర్ రాష్ట్ర ముఠా సభ్యులను మదనపల్లె వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి కారుతో సహా 18 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌చార్జి సీఐ మురళీకృష్ణ తెలిపారు. శనివారం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను ఆయన మీడియాకు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం హైదరాబాదులోని సరూర్‌నగర్‌కు చెందిన విజయ్, రంజిత్ సోదరులు కాగా విజయ్ ఫైనాన్స్ వ్యాపారం చేస్తుండగా రంజిత్ కారు అద్దెకు నడుపుతూ జీవిస్తున్నాడు. అయితే వీరు సులభంగా డబ్బు సంపాదించాలన్న దురాశతో రెండేళ్లుగా పిక్‌పాకెటింగ్, సెల్‌ఫోన్ల చోరీ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వారి మేనమామ తెనాలికి చెందిన ఆదినారాయణ, అతని కుమారుడు శ్యామ్‌రాజుకు విషయం చెప్పారు. దీంతో వారు కూడా చోరీలు చేసేందుకు ఒప్పుకున్నారు. రోజూ చోరీలు చేసుకుని వస్తే నెలకు రూ.40 వేల జీతం ఇచ్చేలా ఒప్పందం చేసుకున్నారు. ఈ క్రమంలో విజయ్ తన స్నేహితులు నంద్యాల జిల్లా డోన్ సమీపంలోని చిగురుమానిపేటకు చెందిన శామీర్, రాజమండ్రికి చెందిన శివయ్యను తీసుకొచ్చి ఆదినారాయణ, శ్యామరాజులకు పరిచయం చేయించారు. ఈ క్రమంలో నలుగురు కలిసి ముఠాగా ఏర్పడి హైదరాబాదు చుట్టుపక్కల ప్రాంతాల్లో పిక్‌పాకెటింగ్, సెల్‌ఫోన్ల చోరీలకు పాల్పడుతున్నారు.

జనం రద్దీగా ఉన్న ప్రాంతాలే టార్గెట్

ముఖ్యంగా జనసంచారం అధికంగా ఉండే సంతలు, డైలీ మార్కెట్లు, బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు తదితర ప్రాంతాల్లో ప్రజల దృష్టి మరల్చి.. చాకచక్యంగా చోరీలు చేస్తున్నారు. నలుగురిలో ఇద్దరు చోరీలకు పాల్పడుతుండగా ఒకరు జనాలను గమనిస్తూ మరొకరు చోరీ చేసిన వెంటనే పారిపోయేందుకు కారును సిద్ధంగా ఉంచుకుంటున్నారు. ఈరకంగా ప్రజలను ఏమార్చి చోరీలు చేస్తున్నారు. బస్సులు, రైళ్లలో పర్సులు చోరీలు చేయడం, సీట్ల వెనుక కూర్చుని జేబులు కత్తిరించడం తదితర పనులు చేస్తున్నారు. కాగా హైదరాబాదు పోలీసులు ఏడాది కిందట నిందితులపై నిఘా ఉంచి అరెస్ట్ చేయడంతో వీరి గుట్టురట్టు అయ్యింది. అనంతరం అక్కడి నుంచి మదనపల్లెకు వచ్చి చుట్టుపక్కల ప్రాంతాల్లో చోరీలకు పాల్పడుతున్నారు. మదనపల్లె వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో రెండు, ముదివేడు పోలీస్‌స్టేషన్‌లో ఒకటి మొత్తంగా మూడు సెల్‌ఫోన్ చోరీ కేసులు నమోదు అయ్యాయి. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తును చేస్తుండగా, ఆదినారాయణ, శ్యామ్యూల్, శివయ్యలు ఇటీవల వాహన తనిఖీల్లో భాగంగా వన్‌టౌన్ పోలీసులకు పట్టుపడ్డారు. అయితే వాహనంలో 18 సెల్‌ఫోన్లు ఉండటంతో అనుమానం వచ్చి అదుపులోకి తీసుకుని విచారణ చేశారు. వారు నేరం అంగీకరించడంతో వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. పట్టుకున్న నలుగురితో పాటు మొత్తం ఆరుగురిపై కేసు నమోదు చేశారు. ఇందులో విజయ్, రంజిత్ పరారీలో ఉండగా, మిగిలిన వారిని అరెస్ట్ చేసినట్లు సీఐ వివరించారు. కారు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు తెలిపారు. కేసు దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. కేసు చేధించిన వన్‌టౌన్ ఎస్‌ఐ హరిహరప్రసాద్, టెక్నికల్ సిబ్బందిని సీఐ అభినందించారు.